REGD NO : APTEL 16144



పాలకులు అవినీతి పరుడైతే..
నీతిమంతులు జైలు పాలవుతారు
- ఫిడేల్ కాస్ట్రో

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 2 | సంచిక : 78 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 23-11-2023 | పేజీలు : 4

## తెలంగాణకు మరోసారి ప్రధాని మోడీ



**హైదరాబాద్, నవంబర్ 22 :** తెలంగాణ ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోడీ రానున్న విషయం తెలిసిందే. తాజాగా బుధవారం మోడీ టూర్ షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 25వ తేదీన కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాలో మోడీ ప్రచారం చేయనున్నారు. 26న దుబ్బాక, నిర్మల్ పబ్లిక్ మీటింగ్‌లో ప్రధాని పాల్గొంటారు. 27న మహబూబాబాద్, కరీంనగర్ పబ్లిక్ మీటింగ్, హైదరాబాద్‌లో రోడ్డు షోలో పాల్గొననున్నారు. 25న రాత్రి రాజ్ భవన్‌లో మోడీ బస చేయనున్నారు. ఈ నెల 25న మధ్యాహ్నం 1:25 గంటలకు దుండిగల్ విమానాశ్రయానికి బయలుదేరి.. 2:05 గంటలకు అక్కడికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2: 15 నుంచి 2:55 వరకు సభలో పాల్గొంటారు. ఆ సభ అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4:05 గంటలకు రంగారెడ్డి జిల్లాకు చేరుకుంటారు. సాయంత్రం 4:15 నుంచి 4:55 గంటల వరకు నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొం టారు. అక్కడి నుంచి బయలుదేరి 7:35 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాజ్ భవన్‌కు చేరుకుని అక్కడే బస చేయనున్నారు. 26వ తేదీన దుబ్బాక, నిర్మల్‌లో పబ్లిక్ మీటింగ్‌లో మోడీ పాల్గొంటారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు కన్హయ్య శాంతివనంలో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి నేరుగా మధ్యాహ్నం 2 గంటలకు దుబ్బాకకు వెళ్తారు. 2:15 గంటల నుంచి 2:45 వరకు దుబ్బాకలో నిర్వహించే పబ్లిక్ మీటింగ్‌లో మోడీ పాల్గొంటారు. ఆ సభ అనంతరం నిర్మల్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 3:45 నుంచి సాయంత్రం 4:25 వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి దుండిగల్ విమానాశ్రయానికి చేరుకుని సాయంత్రం 5:45 గంటలకు తిరుపతికి బయలుదేరనున్నారు. 27వ తేదీన మహబూబాబాద్, కరీంనగర్ పబ్లిక్ మీటింగ్, హైదరాబాద్‌లో రోడ్డు షోలో మోడీ పాల్గొంటారు. 27వ తేదీన తిరుపతి నుంచి బయలుదేరి 11:30 గంటలకు హకీంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మహబూబాబాద్ చేరుకుని మధ్యాహ్నం 12:45 నుంచి 1:25 వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ సభ అనంతరం నేరుగా కరీంనగర్ బయలుదేరనున్నారు. 2:45 గంటల నుంచి 3:25 వరకు కరీంనగర్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4:40కి హైదరాబాద్‌కు చేరుకుం టారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించే రోడ్ షోలో మోడీ పాల్గొంటారు. విమానాశ్రయం నుంచి ఈ రోడ్ షో ప్రారంభం కానుంది. రోడ్ షో అనంతరం నేరుగా హైదరాబాద్ నుంచి 6:25 గంటలకు ఢిల్లీకి తిరుగు పయనం కానున్నారు.

## సత్యసాయిబాబా సేవలు అందరికీ ఆదర్శనీయం



- సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవాలు
- ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**పుట్టపర్తి, నవంబర్ 22 :** మానవసేవే మాధవసేవ అని బోధించిన శ్రీసత్యసాయి సేవలు అందరికీ ఆదర్శనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శ్రీ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి హాజరయ్యారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరు కున్న రాష్ట్రపతికి.. గవర్నర్ అబ్దుల్ నజీర్, సత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ చైర్మన్ రత్నాకర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. సదా సత్యం పలకాలని, సదా ధర్మాన్ని ఆచరించాలన్న బాబా వాక్కులను నిజ జీవితంలో అలవరుచుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు.
వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన శ్రీసత్యసాయి బాబా విద్యాసంస్థల విద్యార్థులకు పట్టాలతో పాటు 21 మందికి బంగారు పతకాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందజేశారు.

## విశాఖ నగరంలో ఆటో-లారీ ఢీ..

- ఏడుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం

**విశాఖ ఎంవీపీ కాలనీ, నవంబర్ 22 :** నగరంలోని సంగం శరత్ థియేటర్ కూడలి వద్ద పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో.. లారీని ఢీకొట్టింది. బుధవారం ఉదయం రైల్వే స్టేషన్ నుంచి సిరి పురం వైపు విద్యార్థులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి లారీని ఢీకొంది. దీంతో ఆటో ఒక్కసారిగా మూడు పల్టీలు కొట్టింది. ఆటోలో ఉన్న ఏడుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రహదారిపై రక్తపు మడుగులో పడి ఉన్న విద్యార్థులను సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆటోను ఢీకొట్టిన లారీ సుమారు 100 మీటర్ల దూరం వెళ్లి ఆగింది. అయితే.. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించిన అనంతరం పోలీసులు వెల్లడించారు.

**పాఠశాల విద్యార్థుల ఆటో బోల్తా..**

మరో ఘటనలో మధురవాడ-నగరం పాలెం రోడ్డులో ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాల య్యాయి. మధురవాడ నుంచి నగరంపాలెం వైపు వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో ఆటోలో ఎనిమిది మంది విద్యార్థులు ఉండగా.. వారందరూ స్వల్పంగా గాయపడ్డారు.

## అక్కడ తిరుగుతా.. ఇక్కడ తిరుగుతా..

- తెలంగాణ ఇచ్చిన ధైర్యంతోనే తాను ఆంధ్రాలో రౌడీలను, ఫ్యాక్షనిస్టులను ఎదుర్కొంటున్న
- బలిదానాల తెలంగాణ అవినీతిమయం కావడం బాధాకరం
- ఆంధ్రా జన్మనిస్తే తెలంగాణ పునర్జన్మనిచ్చింది
- దళితుడిని సీఎంగా చూడలేకపోయాం.. బీసీని చేసుకుందామని పిలుపు
- సమస్యలు వస్తే ఏపీలోలా తెలంగాణలోను పోరాడుతాను
- ఎన్నికల ప్రచారంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్




**హన్మకొండ, నవంబర్ 22 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎలా తిరుగుతున్నానో... ఇక నుంచి తెలంగాణలోను అలాగే తిరుగుతానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ ధైర్యంతోనే తాను ఆంధ్రాలో రౌడీలను, ఫ్యాక్షనిస్టులను ఎదుర్కొంటున్నానని తెలిపారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా హన్మకొండ లో సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలో రౌడీలు రాజ్య మేలుతున్నారని.. గూండాల పాలన నడుస్తోందని, అలాంటి పరి స్థితిని తట్టుకొని తాను నిలబడుతున్నానంటే వరంగల్ పోరాట స్ఫూర్తే కారణమన్నారు. బలిదానాల తెలంగాణలో ఇంత అవినీతి ఉంటుందని తాను ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. తనకు ఆంధ్రా జన్మనిస్తే తెలంగాణ పునర్జన్మనిచ్చిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, పదేళ్ల పాటు తాను తెలంగాణ గురించి మాట్లాడలేదని, దశాబ్దం తర్వాత ఇప్పుడు మాట ఇస్తున్నానని, వచ్చే ఏడాది నుంచి ఆంధ్రాలో లాగే తెలంగాణలోనూ తిరుగుతానని స్పష్టం చేశారు. ఏ మార్పు కోసం తెలంగాణ బిడ్డలు చనిపోయారో అది సాధిద్దామన్నారు. బలిదానాలపై ఏర్పడిన రాష్ట్రం అవినీతిమయం కావడం బాధించిందన్నారు. అవినీతి రహిత తెలంగాణ రావాలన్నారు. తనకు తెలంగాణ ఎంతో బలాన్నిచ్చిందన్నారు. తన పోరాటానికి తెలంగాణ యువత అండగా ఉందన్నారు. బీసీ ముఖ్యమంత్రి కావాలని కోరుకునే వారిలో తానూ ఉన్నానని చెప్పారు. తెలంగాణలో ఇచ్చిన హామీ మేరకు దళిత ముఖ్యమంత్రిని చూడలేకపోయామని, కనీసం బీసీ ముఖ్యమంత్రినైనా చూద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణలో జనసేన ఉంటుందని, బీజేపీతో కలిసి ముందుకు సాగుతుందన్నారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితోనే జనసేనను స్థాపించినట్లు చెప్పారు. పార్టీ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే కారణమని తెలిపారు. డబ్బు లేకపోయినా ఏ బలం లేకపోయినా గుండె బలంతో నిలబడవచ్చునని వరంగల్ గడ్డ నుండి నేర్చుకున్నానన్నారు. నాడు తెలంగాణకు మద్దతు ఇచ్చిన వారిలో తానూ ఒకడినని అన్నారు. సమస్యలు వస్తే తాను ఆంధ్రాలోలా అండగా నిలుస్తానన్నారు. బీజేపీ అభ్య ర్థులు రావు పద్మ, ప్రదీప్ రావును గెలిపించాలని కోరారు.






## జీవితం - వి"చిత్రం"



twitter : @telugu toonz

## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 23 నవంబర్ 2023,

తిథి : శుద్ధ ఏకాదశి (రా.09:06 వరకు)

నక్షత్రం : ఉ, భాద్ర (సా.05:19వ.కు),

బ్రహ్మముహూర్తం : తె 4:52 నుండి తె. 5:40 వరకు,

రాహుకాలం : మ.01:25ల నుండి మ.02:49 వరకు,

యమగండం : ఉ.06:28 నుండి ఉ.07:52

వర్జ్యకాలం : తె.03:43ల తె.05:24, 24తా తె.04:40, తె.06:21

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 23 నవంబర్ 2023

ఫజర్ : తెల్లవారుజామున గం. 5:10

సూర్యోదయం : ఉదయం గం. 6:25

జొహర్ : మధ్యాహ్నం గం. 12:03

అసర్ : సాయంత్రం గం. 3:16

మఘ్రిబ్ : సాయంత్రం గం. 5:40

ఇష : రాత్రి గం. 6:56

## విశాఖలో క్రికెట్ హోరు షురూ..

- నేడు ఇండియా-ఆసీస్ మొదటి టీ20 మ్యాచ్
- ప్రపంచకప్ ప్రతీకారాన్ని భారత్ తీర్చుకుంటుందా..?

**విశాఖపట్నం, నవంబర్ 22 :** ఆస్ట్రేలియా - టీమిండియా టీ20 సీరీస్‌లో తొలి మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. విశాఖలో జరిగే ఈ మ్యాచ్ గురువారం సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమవుతుంది. ఇప్పటికే రెండు జట్లూ విశాఖ చేరుకున్నాయి. ఇరు జట్ల ఆటగాళ్లు బుధవారం కాసేపు స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు. ఇండియా- ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన టీమిండియా, టీ20 సీరీస్‌లోనైనా ప్రతీకారం తీర్చుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.


జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా

# రాజకీయ కౌరవుడు.. దోపిడీల దుండగుడు!

## ఎడిటోరియల్

శిష్యుడు వచ్చేసరికి గురువుగారు ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటున్నారు. తన్మయత్వంతో తలూపుతూ ఆయన ఆనందిస్తుంటే, శిష్యుడు చాలాసేపు ఎదురు చూశాడు.

ఆఖరికి విసుగొచ్చి, "అదేంటి గురూగారూ! నేనేదో మీ దగ్గర రాజకీయ పాఠాలు నేర్చుకుందామని వస్తే, మీరేమో పాటలతో కాలక్షేపం చేస్తున్నారూ?" అంటూ నిష్ఠూరమాడాడు.

గురువుగారు ఫోన్ పక్కన పెట్టి, "సినిమా పాటలంటే అంత చులకనొద్దురోయ్. అవి కూడా రాజకీయాలు నేర్పుతాయి తెలుసా?" అన్నారు.

"ఊరుకోండి సార్... మీరు మోకాలికీ బోడిగుండుకీ ముడి పెడతారు. పాటలు పాఠాలు చెప్పడమేంటండీ?"

"మరదే తెలివితక్కువతనమంటే. నేర్చుకోవాలనే తపనుండాలే కానీ ఎందులోనుంచైనా మనక్కావలసినదాన్ని పిండుకోవచ్చు. కావాలంటే నేనొక పాట పెడతాను. దాని పరమార్థం ఏమిటో చెప్పు చూద్దాం..."

"సరే పెట్టండి. వద్దంటే మాత్రం మీరు వింటారా?"

"అప్పు చేసి పప్పుకూడు తినరా ఓ నరుడా...
గొప్ప నీతి వాక్యమిదే వినరా పామరుడా...
ఉన్నవాడు లేనివాడు రెండే రెండు జాతులురా...
ఉన్నచోట తెచ్చుకొనుట లేనివాడి హక్కురా!
వేలి ముద్ర వేయరా సంతకాలు చేయరా...
అంతగాను కోర్టుకెళితె ఐపీ బాంబుందిరా!
రూపాయే దైవమురా రూపాయే లోకమురా...
రూక లేనివాడు భువిని కాసుకు కొరగాడురా!"

"అయ్యబాబోయ్... భలే పాటండీ బాబూ ఇది. ఘంటశాల పాడాడండి. మరింత చక్కని పాటలో రాజకీయం ఏముందండీ, చోద్యం కాకపోతేనూ?"

"భలేవాడివిరా.. రాజకీయం ఎక్కడో ఉండదురా. నీ చుట్టూనే వైఫైలాగా అల్లుకుని ఉంటుంది. నువ్వు దాన్ని ఆన్ చేసుకుని ఆలోచించాలంతే. మరిప్పుడు నీ పరగణాని ఏలుతున్న అధినేత ఈ పాటని ఔపోసన పట్టేశాడని కానుకో వద్దురా? రేప్పొద్దున నీ అదృష్టం బాగుండో, ప్రజల ఖర్మకాలో నువ్వు పాలకుడివైపోయావనుకో, అప్పుడు ఈ పాటే కదరా నీకు కర్తవ్యం బోధించేది?"

"అదెలాగండీ? కాస్త వివరించి చెబుదురూ..."

"ఏముందిరా... మొన్నటికి మొన్న పార్లమెంటులో నీ పరగణా ఎంత అప్పుల ఊబిలో కూరుకుని పోయిందో బయటపడింది కదరా. ఒకటా, రెండా.. నీ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 4 లక్షల 42 వేల కోట్లకు పైగా అప్పులు చేసిందని స్వయంగా కేంద్ర మంత్రి ప్రకటించలేదూ? ఇక్కడితో ఆగిందా? కార్పొరేషన్లు, ఇంకా ఇతర మార్గాల్లో చేస్తున్న అప్పులు దీనికి అదనం అని కూడా చెప్పారా లేదా? అన్నీ కలిపితే మొత్తం అప్పులు పది లక్షల కోట్ల పైమాటేనని ఆర్థిక నిపుణులు, ప్రతిపక్షాలు కోళ్లై కూయడం లేదూ? వీటన్నింటి భారం పడేది ప్రజల మీదే కదా? అప్పుడిక ప్రజలంతా కలిసి 'అప్పుల కుప్ప వయ్యారి భామా...' అని పాడుకోక వేరే దారేముంది చెప్పు?"

"అవునండోయ్... కానీ నాకు తెలియక అడుగుతాను, ఇలా ఎడా పెడా అప్పులు చేయడం చాలా దారుణమంట కదండీ? దీని ప్రభావం భావి తరాలపై పడుతుందటగా? ఆఖరికి శ్రీలంక, పాకిస్థాన్‌లాంటి కొన్ని దేశాల్లోలాగా పరిస్థితి ఘోరంగా తయారైపోయి, జనం భోజనానికి కూడా అల్లాడిపోతారని చెబుతున్నారు కదండీ?"

"ఒరే.. నీ కుటుంబం తరతరాల గురించి ఆలోచించాలి కానీ, రాష్ట్ర ప్రజల భావి తరాల గురించి నీకెందుకురా? ఆళ్లు అడుక్కుతింటే నీకేల? నీక్కావలసిందల్లా ప్రస్తుతం నీ అధికారం బాగుంటే చాలదూ? అలవి కాని ఉచిత పథకాలు ప్రకటించేసి, సాధ్యం కాని హామీలు గుప్పించేసి జనానికి ఆశలు పెట్టి, ఆళ్ల ఖాతాల్లో సొమ్ములు మీట నొక్కి పంపించేసి ఆ ఓట్లు నీకు పడేలా చూసుకుంటే చాలదూ? పావలా పాసుబుక్కులో పడేసి, ఆళ్ల జేబులోంచి రూపాయి లాక్కుంటే మాత్రం నిన్నడిగేదెవడ్రా?అందుకోసం అందిన చోటల్లా అప్పులు చేయడం తప్ప మార్గమేముంది? వడ్డీలు ఎంతయినా తెచ్చేయొచ్చు. ఇంకా కావాలంటే రాష్ట్రానికి రాబోయే ఆదాయాన్ని కూడా తనఖా పెట్టి రుణాలు దండుకోవచ్చు. అర్థమైందా?"

"అర్థమవడమేంటండీ బాబూ, తల గిర్రున తిరిగిపోతుంటేను? అప్పు చేసి పప్పు కూడు పాట సరిగా వింటే ఇంత రాజకీయం వంటబడుతుందని తెలిసిందండి... ఇప్పుడే పాట వినిపిస్తారండీ?"



"దోపిడీ దోపిడీ అంతా దొంగల దోపిడీ...
చిన్న చేపలను పెద్ద చేపలు చెప్పకుండ భోంచేయురా...
ఉన్నవాణ్ణి పైనున్నవాడు చేజిక్కితె స్వాహా చేయురా...
పేదల నెత్తురు పిండి పిండి జేబులు నింపిరి బాబులూ...
ఆ జేబులు బొత్తిగ ఖాళీ అయితే ఇంకేమున్నవి డాబులూ..."

"ఆ.. గుర్తొచ్చింది గురూగారూ! ఇది 'మంచి మనిషి' సినిమాలోదండి. ఎన్టీఆర్ హీరో అండి. భలే సరదాగా ఉంటుందండి... కానీ ఇందులో పాఠమేముందండీ?"

"ఏడిశావ్.. ఆ సినిమాలో హీరోగారు మంచిగా మారతాడు కానీ, నీ నిజ జీవితంలో నిన్ను పాలిస్తున్న నేత మాత్రం అలా కాదు కదరా? మారనుగాక మారడు. ఆయన పాటిస్తున్న విధానాలన్నీ ఈ పాటలోవే కదరా మరి?"

"అదెలాగండీ...?"

"ఏముందిరా... అధికార పీఠం మీద నువ్వు కూర్చోవాలే కానీ రాష్ట్ర ప్రజల ఆస్తులన్నీ నీవే కదరా? రోడ్లు వేయిస్తామని పెట్రోలు మీద సెస్సు వేశావనుకో, ఆ వెర్రి జనం నుంచే కోట్లకు కోట్లు వచ్చిపడతాయి. ఆటికేమన్నా లెక్కా? జమా? హోల్సేలు వ్యాపారులతో మాటాడుకుని ధరలు పెంచనిచ్చావనుకో, నీ సొంత ఖాతాలో కోట్లు జమైపోతాయి. ఇక చెత్త బాగు చేయాలనో, మరోటనో వంకెట్టి పన్నులు వేశావనుకో. పిచ్చి జనం కష్టపడి సంపాదించిన సొమ్ము మూకుమ్మడిగా పోగుపడదూ? అయ్యన్నీ ఎక్కడికి పోయాయో నువ్వేమన్నా లెక్క చెప్పాలా, ఏమన్నానా? మరిది దోపిడీ కాదూ? ఒరే... నీ అధినేత అడుగుజాడల్లో నడిచే తెలివితేటలు నీకు అబ్బాలే కానీ, పేదోళ్లకి పాత ప్రభుత్వాలు ఇచ్చిన స్థలాలు, ఇళ్ల మీద కూడా డబ్బులు గుంజుకోవచ్చు, పైగా ఆళ్ల మేలుకేనని చెప్పి మరీనీ! మరిది పేదల నెత్తురు పిండడం కాదూ? ఇక నువ్వేలుతున్న రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, సర్కారు వారి గనులు, కొండలు, గుట్టలు, ఆఖరికి ఇసుక పర్రలు కూడా నీ సొంత ఖజానానికి కామధేనువులే కదరా? వాటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు పిండుకోవచ్చు. ఫలానా కంపెనీ పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు కట్టేస్తుందంటూ ఓ ప్రెస్మీటెట్టి, ప్రభుత్వ భూములు రాసిచ్చేయొచ్చు. అలా ఇచ్చినందుకు ఆ కంపెనీ నీకు వాటా సమర్పించుకుంటుందని వేరే చెప్పాలా? ఆ తర్వాత ఆ కంపెనీ ఆ ఫ్యాక్టరీలు కట్టిందో లేదో ఎవడు చూడొచ్చాడు? కొన్నాళ్లు పోయాక ఆ భూముల్ని రియల్ ఎస్టేటు వ్యాపారం చేసి అమ్ముకున్నా అడిగేవాడుండడు. అలాగే గనులు కూడాను. పైకి అనుమతి తీసుకునేది ఏ సున్నపు రాయి కోసమో అయినా, లోపాయికారీగా తవ్వుకుని తరలించేది వాటిలోని విలువైన ఖనిజాలనే కదా? ఈ నిజాలేమైనా బయటపడేవా ఏమన్నానా? ఏమంటావ్?"

"ఇంకేమంటానండీ, పాటల్లో ఇన్నేసి పాఠాలున్నాయని తెల్లబోవడం తప్ప. సార్... ఈసారి ఏదైనా మాలాంటి కుర్రాళ్లకు ఊపిచ్చే పాటేదైనా పెట్టండి సార్..."

"కోకా కోకా కోకా కడితే కొరకొరమంటూ చూస్తారు..
పొట్టి పొట్టి గౌనే వేస్తే పట్టీపట్టీ చూస్తారు..
కోకా కాదు, గౌను కాదు.. కట్టులోన ఏముంది?
మీ కళ్లల్లోనే అంతా ఉంది మీ మగ బుద్ధే వంకర బుద్ధి..
ఊ.. అంటావా? మావా, ఊహూ అంటావా?"

"అబ్బ.. అదరగొట్టారు సార్ 'పుష్ప'లో పాటేసి. కానీ గురూగారూ, ఈ ఐటెమ్ సాంగులో పాఠం ఏముంటుందండీ?"

"ఆ 'పుష్ప' సినిమా హిట్టే కావచ్చురా. కానీ ప్రజల చెవుల్లో పుష్పాలు పెట్టే నీ నేతల సినిమా అంతకంటే సూపర్‌హిట్టు కాదురా? అధికారం చేతిలో ఉంటే ఎలాంటి తైతక్కలైనా చెల్లుతాయని చెప్పడానికీ పాటొక ఎగ్జాంపులొరే. మరి నీ రాష్ట్రంలో ఆమధ్య ఓ అమాత్యులుంగారు పండగ పేరు చెప్పి ఏకంగా కాసినో గాంబ్లింగు సెట్టింగెట్టేసి అమ్మాయిలతో కలిసి స్టెప్పులేసిన సంగతి ఎలా మర్చిపోతాంరా? బాధ్యతాయుతమైన పదవిలో ఉండే ఓ ప్రజాప్రతినిధి చేయాల్సిన పనేరా ఇది? కానీ ఎవరైనా నోరెత్తారా అని? ఇలాంటోళ్లా మనం ఓటేసి ఎన్నుకున్నోళ్లని జనం బిత్తరపోయారు కానీ, ఆ నేతలకి ఓ సిగ్గా? ఎగ్గా? ఏకంగా పేపర్లలో ఫొటోలు, వార్తలు వచ్చినా చలించారా అని? నీ అధినేత కూడా కిమ్మన్నాడా అని? మరెంత తెంపరితనమో తెలిసిందా? ఈల్లవన్నీ వంకర బుద్ధులే అయినా గెలిపించిన పాపానికి అమాయక ప్రజలు భరిస్తున్నారు చూశావా? మరి నీ నేతల అనుచరులు, అనుయాయులు, ఆళ్ల తోకలు కలిసి రాష్ట్రంలో ఆడవాళ్ల మీద అత్యాచారాలని దేశం మొత్తం మీద ఘనతకెక్కేలా చేస్తున్నారు కదరా? ఆఫీసుల్లో పని చేసుకునే ఆడాళ్లకు కూడా అధికార పార్టీ వాళ్ల వేధింపులు తప్పడం లేదన్నా, అలాంటి నీచులపై ఎలాంటి కేసులు కూడా నమోదవడం లేదన్నా, అంతకు మించిన ఘోరం ఉందా అని? మరి ఇంతకు మించిన అధికార రాజకీయ అధమాధమ పాఠం ఇంకేముంటుందిరా?"

"అవునండి బాబూ.. దిమ్మ తిరిగిపోతోంది. ఎంత అధికారం ఉంటే మటుకు మరీ ఇంత అధ్వానమా, అనిపించేస్తోందండి.. ఇప్పుడింకో పాటేయండి గురూగారూ.."

"ఫిఫ్టీ.. ఫిఫ్టీ..
నీవో సగం.. నేనో సగం..
సగాలు రెండూ ఒకటైతే
జగానికే ఒక నిండుదనం..
ఫిఫ్టీ.. ఫిఫ్టీ.."

"గురూగారూ.. ఇది అక్కినేని, కాంచన నటించిన డ్యూయెట్టండి. 'పవిత్ర బంధం' సినిమాలోదండి. ఆఖరికి యుగళగీతాలు కూడా రాజకీయాలు నేర్పుతాయాండీ?"

"ఒరే.. రాజకీయాల్లో ఉండేవన్నీ యుగళగీతాలేరా. ఈ పాట పవిత్రబంధంలోదే కావచ్చుకానీ, నీ పాలకుల హయాం చూపించే సినిమా మాత్రం 'అపవిత్ర బంధం'రా. ఆ పాటలోలాగే అధినేత నుంచి అమాత్యులు, స్థానిక అధికార పార్టీ నేతల వరకు పాడుతున్న డ్యూయట్టు ఇదే కదరా? అంతా 'ఫిఫ్టీ.. ఫిఫ్టీ..' వ్యవహారమే నడుస్తోంది మరి. ఓసారలా ఇసుక కేసి చూడు. మరోసారలా మద్యం కేసి తల తిప్పు. ఇటు పేదల బియ్యం మాఫియాకేసి చూసినా, అటు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాల కేసి చూసినా అంతా కనిపించేదీ, వినిపించేదీ ఈ యుగళగీతమే కదా? ఏ వ్యవహారం తీసుకున్నా ఎక్కడికక్కడ 'నీకో సగం.. నాకో సగం..' అన్నట్టు పంచుకోవడం లేదూ? ఆఖరికి ఓ అభాగ్యుడు మరణించినందుకు ఆ కుటుంబానికి వచ్చే సాయంలో కూడా సగం ఇమ్మని ఓ అమాత్యుడు అడిగాడంటే దానికి మించిన నికృష్ట పాఠం ఏముంటుందిరా? అధికారం, అవినీతి కలిసి డ్యూయట్టు పాడుతున్నట్టు లేదూ? ఇప్పటికైనా అర్థమైందా పసందైన పాటలు చెప్పే అసహ్యమైన పాఠాలేంటో?"

"అర్థమైంది గురూగారూ! ఇప్పుడు మీరు కాదండి. నేనే ఓ పాట పెడతాను. అది వినండి..."

"అంతా నా ఇష్టం..
ఎడాపెడా ఏం చేసినా అడిగేదెవడ్రా నా ఇష్టం..
చెడామడా చెలరేగినా చెప్పేదెవడ్రా నా ఇష్టం..
మీ ఇళ్లలో గబ్బిలాలనే పెంచండి అంటా నా ఇష్టం..
కుకూ అని గుడ్లగూబనే కూయించమంటా నా ఇష్టం..
హిస్టరీ కొత్తగా రాయమంటా..
హిట్లర్‌ని దేవుడిగ చేయమంటా..
టైగర్‌ని పచ్చగడ్డి మేయమంటా..
పావురానికి బాంబులిచ్చి వేయమంటా..
అంతా నా ఇష్టం.. అంతా నా ఇష్టం.."

"విన్నారా గురూగారూ? కౌరవుడు సినిమాలోదండి ఈ పాట. మన అధినేత పరిపాలన తీరు ఇలాగే ఉందండి. ఏం చేసినా ఎవరేం చేస్తారనేంత ఇష్టారాజ్యంగా సాగుతోందండి వ్యవహారం. హిస్టరీని ఇప్పటికే కొత్తగా, చెత్తగా రాసేశాడండీ రాజకీయ కౌరవుడు. స్వయంగా ఆయనే హిట్లర్‌గా మారాడండి. టైగర్‌లాంటి పోలీసు వ్యవస్థని గులాములు చేసి సర్కస్‌లో పులుల్ని ఆడించినట్టు ఆడిస్తున్నాడండి. మరది ఆళ్ల చేత పచ్చగడ్డి మేయించినట్టే కదండీ? శాంతి భద్రతలని గాలికొదిలేశాడండి. ఇప్పుడు శాంతి అంటే అధినేత మనశ్శాంతి మాత్రమేనండి. ఇక భద్రత అంటే ఆయనకి, ఆయన పార్టీ అనుచరులకే భద్రత కల్పించడమండి. పావురానికి బాంబులిచ్చి వేయమనడం అంటే ఇదే కదండీ మరి? ఎవడైనా నోరెత్తి అదేమని ప్రశ్నిస్తే చట్టంలో కాలం చెల్లిన కేసుల్ని సైతం తిరగదోడి బుక్ చేస్తున్నారండి. ఏ ప్రతిపక్ష నాయకుడైనా నిరసన ప్రదర్శన చేయబోతే ఎక్కడ లేని ఆంక్షలు, నిబంధనలు పెడుతున్నారండి. అంతా ఆళ్లిష్టమన్నట్టు సాగుతోంది కదండి... ఎలా ఉందండి ఈ పాటలో పాఠం?"

"సెభాష్‌రా.. శిష్యా! పాటల్లో అరాచకీయాన్ని ఇట్టే గ్రహించావ్... మరి నీ పాలకుల అకృత్యాలన్నీ చూసి విసుగెత్తి పోయిన జనం ఒక్కొక్కడూ ఒక్కో జనసైనికుడైతే ఎలా ఉంటుందో, ఏమవుతుందో కూడా ఓ పాటలో చెప్పు చూద్దాం.."

"తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా
ఆంధ్ర మాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా
దారుణ మారణకాండకు తల్లడిల్ల వద్దురా
నీతి లేని శాసనాలు నేటి నుండి రద్దురా
ఎవడు వాడు? ఎచటి వాడు?
ఇటు వచ్చిన కంత్రీగాడు?
తగిన శాస్తి చేయరా
తరిమి తరిమి కొట్టరా
ప్రతి మనిషి తొడలు కొట్టి
తుది సమరం మొదలు పెట్టి
సింహాలై గర్జించాలీ
సంహారం సాగించాలీ!"

# మోడరైజేషన్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్‌లో అగ్రస్థానంలో ఏపీ

### హోంమంత్రి తానేటి వనిత






**అమరావతి, నవంబర్ 22 :** అగ్నిమాపక సేవల ఆధునీకరణలో భాగంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను సులభతరం చేసేందుకు వీలుగా ఫైర్ సర్వీసెస్ ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 2వ బ్లాక్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. ముందుగా విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్, 6 ఫైర్ సర్వీస్ గెజిట్ నోటిఫికేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ కమిటీ రిపోర్ట్, రికమెండేషన్స్ పుస్తకాన్ని హోంమంత్రికి అందజేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అగ్ని మాపక పంపులను వికేంద్రీకరించడం, ఖర్చు తగ్గించడం, ఆపరేషన్ సౌలభ్యం, నిర్వహణ, ఫైర్, ఎన్‌ఓసీ ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను సులభతరం చేసేందుకు వీలుగా 6 నోటిఫికేషన్లు జారీ చేసినట్లు సమీక్షా సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి, కమిటీ మెంబర్, కన్వీనర్ జి.విజయ్ కుమార్, ఇంటిలిజెన్స్ సూపరిటిండెంట్ ఆఫ్ పోలీస్, మెంబర్ పి.సత్య ఏసుబాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ భవనాలలో అగ్ని భద్రతా ప్రమాణాలు, నిరభ్యంతర ధృవపత్రము (ఎన్‌ఓసీ)లను జారీ చేయడానికి సంబంధించి 18.01.2022 నుండి 13.10.2022 వరకు డీజీ ఫైర్ సర్వీసెస్ ద్వారా ఆరు గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ నోటిఫికేషన్ల ద్వారా సాధారణ నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆధారిత అగ్ని మాపక పరికరములకు బదులుగా ప్లంజర్ పంపులను సూచించడం ద్వారా నేషనల్ బిల్డింగ్ కోడ్ మార్గదర్శకాలకు ప్రత్యామ్నాయాలను అందించడం జరిగిందని వివరించారు. భవనాలు ప్రతి కోణం నుండి సురక్షితంగా, భద్రంగా ఉండే విధంగా.. అవి భారతదేశంలోని ఎన్బీసీలో పొందుపరచబడిన భద్రతా నిబంధనల ప్రకారం నిర్మించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవా చట్టం 1999 కూడా వివిధ ఆఫీసు భవనాల్లో అగ్ని, ప్రాణరక్షణ చర్యలను అమలు చేయడానికి నేషనల్ బిల్డింగ్ కోడ్ మార్గదర్శకాలను అనుసరించాలని వివరించారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రం కూడా ప్లంజర్ పంపులను అగ్నిమాపక భద్రతా పంపులుగా ఉపయోగించడం లేదని, అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలు లేదా రాష్ట్ర అగ్ని మాపక సేవలు నేషనల్ బిల్డింగ్ కోడ్ మార్గదర్శకాలను అనుసరిస్తున్నాయన్నారు. ఇంకా, గెజిట్ లో సెట్ బ్యాక్, ఖాళీ స్థలం, బ్యాంకు హామీ, ఫైర్ ప్లాన్ లకు సంబంధించి కొన్ని సడలింపులను ఇచ్చాయి. సెట్ బ్యాక్, ఖాళీ స్థలాలను నిర్ధారించడానికి స్థానిక భవనాల నిబంధనలను (లోకల్ బుల్డింగ్ రూల్స్) అనుసరించాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది. చెక్ లిస్ట్ ద్వారా ఎలక్ట్రికల్ భద్రతపై గెజిట్ ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది, దానిని కొనసాగించవచ్చని తెలిపింది. అలాగే 5 సంవత్సరాల వరకు ఉన్న ఎన్వోసీల ప్రస్తుత చెల్లుబాటు వ్యవధిపై మార్పులు చేయాలని కమిటీ సూచించింది. రెసిడెన్షియల్ వంటి తక్కువ ప్రమాదకర ప్రాంగణాలు 3 సంవత్సరాలు, హాస్పిటల్స్, బిజినెస్, అసెంబ్లీ వంటి వాణిజ్య భవనాలు, తక్కువ వంటి మితమైన ప్రమాదకర ప్రాంగణాలు 2 సంవత్సరాలు, అధిక ప్రమాదం ఉన్న పరిశ్రమలకు 1 సంవత్సరం చెల్లుబాటు వ్యవధిని సిఫారసు చేసింది. అయితే, కొన్ని తక్కువ ప్రమాదకర కట్టడాలను అగ్ని మాపక అధికారుల తనిఖీ నుండి మినహాయిందాలని, లాడ్జింగ్ వంటి వార్షిక స్వీయ-ధృవీకరణను అనుమతించడం ద్వారా అక్కడ ఎన్వోసీ ప్రక్రియను మినహాయించాలని కమిటీ సిఫార్సు చేసినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ఫైర్ సర్వీసెస్ అధ్యయనం, వివిధ రాష్ట్రాల ఫైర్ సర్వీసెస్ లను కలవడం ఆధారంగా కొన్ని ఉత్తమ అభ్యాసాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) కోసం కమిటీ సిఫార్సు చేస్తోందని వివరించారు. భారతదేశ ప్రభుత్వం సూచించిన మోడల్ ఫైర్ ఫోర్స్ బిల్లు, 2019 తరహాలో ఏపీ ఫైర్ సర్వీస్ చట్టం, 1999 సవరణను వివరించారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ మొదలైన తరహాలో అన్ని ఎత్తైన భవనాల్లోని ఆచరణాత్మక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా అగ్నిమాపక పరికరాలను తగ్గించడం. అనవసరమైన కష్టాలను నివారించడానికి, ఆక్యుపెన్సీ వారీగా అగ్ని భద్రతా చర్యలను సవరించాలని సూచించింది. ధ్రువీకరించబడిన ఏజెన్సీల ద్వారా అగ్నిమాపక పరికరాల సరఫరా జరుగుతుందన్నారు. భవనం చుట్టూ ఉన్న అడ్డంకులు/బహిరంగ స్థలాలను నిర్ధారించడంలో ఉన్న లోటుపాట్లను పరిష్కరించడానికి, భవన నిర్మాణ అనుమతి దరఖాస్తులను స్థానిక సంస్థల ద్వారా అగ్నిమాపక సేవల విభాగానికి పంపాలని కమిటీ సూచించింది. తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, డిఫెన్స్ తరహాలో అగ్ని మాపక శాఖలోకి మహిళా ఫైర్ ఆఫీసర్ల ప్రవేశం కల్పించాలి. చాలా రాష్ట్రాలు తమ యూనిఫాం కోడు సవరించుకున్నందున ప్రస్తుత బ్రిటీష్ కాలం నాటి యూనిఫాం కోడ్‌ను సవరించాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల క్రింద అగ్నిమాపక సేవల ఆధునీకరణలో భాగంగా రసాయనిక, ఎత్తైన భవనాలలో అగ్ని రక్షణ సహాయక చర్యల కొరకు రోబోట్లు, డ్రోన్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్, కమ్యూనికేషన్ పరికరాలు, అధునాతన అగ్ని మాపక వాహనాలు మొదలైనవి అమర్చుకోవాలి. తుఫానులు, వరదలు, రోడ్డు/రైలు రక్షణ వంటి అత్యవసర పరిస్థితులలో ఫైర్ సర్వీస్ సిబ్బంది ముందుగా స్పందిస్తారు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళంను తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల తరహాలో అగ్ని మాపక శాఖ నియంత్రణలోకి తీసుకుని వచ్చిన యెడల సమర్థంగా పనిచేయగలుగుతుందని కమిటీ సూచిస్తున్నట్లు హోంమంత్రి తానేటి వనిత అధ్యక్షత జరిగిన సమీక్షా సమావేశంలో వెల్లడించారు. ఈ సమీక్షలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటిలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, ఫైర్ సర్వీసెస్ డీజీ సునీల్ కుమార్, సివిల్ డిఫెన్స్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పి. వెంకట రమణ, డెరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మురళీ మోహన్, అడిషనల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, జ్ఞానసుందరం, ఇతర ఫైర్ సంబంధిత అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు మేలైన సేవలు అందించాలని హోంమంత్రి తానేటి వనిత కోరారు.

# ఇసుక కుంభకోణం కేసు.. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**అమరావతి, నవంబర్ 22 :** ఇసుక కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఇరువైపుల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం కేసుల విచారణను వాయిదా వేసింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో తదుపరి వాదనలను అడ్వకేట్ జనరల్ వినిపించనున్నారు. ఈ కేసులో చంద్రబాబు తరఫు న్యాయవాదుల వాదనలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఇసుక కుంభకోణం అంటూ సీఐడీ చేస్తున్న ఆరోపణలలో ఎలాంటి ఆధారాలు లేవని వాదించారు. 17 -ఏ నిబంధన ప్రకారం అభియోగాలు నమోదుకు గవర్నర్ అనుమతి తీసుకోలేదని వాదించారు. ప్రభుత్వం నిర్ణయాన్ని క్రిమినల్ కేసు ద్వారా విచారణ జరపకూడదని చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాదించారు. ఉచితంగా ఇసుకను ఇచ్చారు కాబట్టి ఖజానాకు నష్టం జరిగిందని అనడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అది ప్రభుత్వ నిర్ణయం, సామాన్యులకు మేలు చేయాలనే ఉద్దేశంతో చేసిన నిర్ణయంగానే చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విధానపరంగా తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పట్టేందుకు ఏముంటుందని కోర్టును ప్రశ్నించారు. ఉచిత ఇసుక అనేది ఏవిధంగానూ చట్ట విరుద్ధం కాదని వాదనలు వినిపించారు. ఇసుక ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో పేదలకు, భవన నిర్మాణ పనులకు అందుబాటులో ఉండేలా అప్పటి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని ఈ విధాన పరమైన నిర్ణయం తీసుకుందని చంద్రబాబు నాయుడు తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.



### జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో

# సెయింట్ ఆన్స్ కాలేజ్ విద్యార్థుల విజయపతాకం



**చీరాల, నవంబర్ 22 (జనస్వరం) :** జాతీయ స్థాయి వాలీ బాల్ పోటీలలో, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి విద్యార్థులు, విశేష ప్రతిభ కనబరిచి విజయపతాక ఎగరవేసి, కళాశాల పేరు ప్రతిష్టలను మార్మోగించారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాల విద్యార్థుల వాలీ బాల్ జట్టు జాతీయ స్థాయి పోటీలలో విన్నర్స్‌గా గెలుపొందినట్లు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి తెలిపారు. శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజిలో, సిల్వర్ జూబ్లి సెలబ్రేషన్స్ సందర్భంగా, నవంబర్ 18 నుండి 20 వరకు జరిగిన, జాతీయ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలలో, వాలీ బాల్ పోటీలలో పాల్గొన్న 40 జట్లతో పోటీపడి, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాల జట్టు విజ్ఞాన్ యూనివర్సిటి జట్టుపై, ఫైనల్స్‌లో గెలిచి విన్నర్స్‌గా గెలుపొందినట్లు, కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్. మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఫైనల్స్ పోటీలో మొదటి ఇన్నింగ్స్‌లో 13 పాయింట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 14 పాయింట్లు తేడాతో, జయప్రదంగా ఫైనల్స్‌లో విన్నర్స్‌గా నిలిచి, ట్రోఫీని సాధించినట్లు తెలిపారు. ఈ వాలీబాల్ జట్టులో బి.టెక్ చదువుతున్న విద్యార్థులు యస్.తాతాజి, ఆర్.విష్ణు బాబు, జి.సాయికృష్ణ, యం.మణికంఠ, కె.వెంకట శివా రెడ్డి, యంఆర్‌వి మణి కుమార్, కె.ఆంద్రూస్, ఆర్.రమణ, జి.వి.ఆర్. తేజారెడ్డి, డి.హరికృష్ణారెడ్డి, కె.సాయి కుమార్, కె. సన్నిలు ఈ పోటీలలో పాల్గొన్నట్లు, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో అక్రిడిటేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.సుబ్బారావు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, పాల్గొని వాలీబాల్ జట్టుకు అభినందనలు తెలియజేశారు.

### గూడెం కొత్తవీధి మండలాన్ని

## కరువు మండలంగా గుర్తించాలి

**మాజీ జిల్లా టీడీపీ కార్యదర్శి ముక్కలి మహేష్**



**గూడెం కొత్తవీధి, నవంబర్ 22 (జనస్వరం) :** మండలంలో వర్ష భావ పరిస్థితుల వలన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని గూడెం కొత్త వీధి మండలం రైతు సంఘం తీవ్ర స్థాయిలో నష్టపోయారని అందుకు జీకే వీధి మండలాన్ని కరువు మండలం గా ప్రభుత్వం గుర్తించాలని మాజీ జిల్లా టీడీపీ కార్యదర్శి ముక్కలి మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో 16 పంచాయతీల్లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు సమగ్ర సర్వే చేసి పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జికే వీధి మండలం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గుంట బుజ్జిబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.

### రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలన

## సీఎం జగన్‌తోనే సాధ్యం

**- వైసీపీ మండల అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి**



**చీరాల, నవంబర్ 22 (జనస్వరం) :** రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలన, సీఎం జగన్‌తోనే సాధ్యమని, వైసీపీ ప్రభుత్వ హయాంలోనే, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, వైసీపీ చీరాల మండల అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి అన్నారు. చీరాల మండలం రామకృష్ణాపురం-2 సచివాలయం పరిధిలో, జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా, వైసీపీ నేతలు ఇంటింటికీ తిరిగి, మళ్ళీ జగన న్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురించి వివరించారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ చీరాల మండల అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, ఎంపీటీసీ గోలి నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ షేక్ ఆజాద్, బుర్ల మురళి కృష్ణ, పర్వతనేని శ్రీనివాసరావు, పృధ్వీ ధనుంజయ, గుంటూరు వెంకట సుబ్బారావు, తేళ్ల రాంబాబు, దుడ్డు మార్క్, దివిజయరావు, గుర్రం బుజ్జి, అందే సుబ్బారాయుడు, ముచ్చు దేవేంద్ర, మంచికల పాటి శ్రీనివాసరావు, సిహెచ్. రమణయ్య, బడుగు చిన్న, బక్కా శివ నాగుల రెడ్డి, ఆసాది బంగారు రెడ్డి, గుండప్పు రజనీకాంత్, మాచర్ల సత్యనారాయణ, గుర్రం జాన్సన్, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు రింతాడలో

## భగవాన్ సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు

**జీ.కే వీధి, నవంబర్ 22 (జనస్వరం) :** మండలంలోని రింతాడ పంచాయతీ రింతాడ గ్రామంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి అనుగ్రహ ఆశీస్సులతో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా జన్మదిన వేడుకలను గురువారం రింతాడ గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు జీ.కే వీధి, చింతపల్లి మండల సమితి పదాధికారులు, డివిజన్ పదాధికారులు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు భక్తులు అందరూ గురువారం ఉదయం 9 గంటలకు రింతాడ గ్రామానికి చేరుకుని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి జన్మదిన వేడుకల్లో పాల్గొని స్వామివారి దివ్య అనుగ్ర హాన్ని పొందగలరని ఆశిస్తున్నామని మండల పదాధికారులు తెలియజేశారు.

## పెద్దిరాజుపాలెంలో మాజీ ఎమ్మెల్సీ శివకుమారి పరిచయ వేదిక



**పాయకరావుపేట నవంబర్ 22 (జనస్వరం) :** మండలంలోని పెద్దిరాజుపాలెం గ్రామంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు గెడ్డం బుజ్జి సూచనల మేరకు జన సైనికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిచయ వేదికలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి పాల్గొన్నారు. గ్రామంలోని జనసేన పార్టీ నాయకులు, జన సైనికులను లక్ష్మీ శివకుమారికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ శివకుమారి మాట్లాడుతూ మన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆపదలో ఉన్న వారికి నేనున్నాను అంటూ ముందుకెలుతూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని, రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే తపన పడుతున్నారని తెలియజేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి వెళ్లే విధంగా, వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండా ఎగరవేసే విధంగా ప్రతి ఒక్క జనసైనికుడు ఇప్పటి నుంచే పట్టుదలతో కష్టించి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు యగదాశి నానాజీ, నక్క సాంబయ్య, కే అప్పలరాజు, కే అప్పారావు, సిహెచ్ త్రాసు, ఎం శ్రీను, కే శివ చింతాకుల శ్రీను, నరేష్, శివాజీ రాజు, తుమ్మల గణేష్, కట్టా నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన చట్టాలు అమలుకు రాష్ట్రపతి కృషి చేయాలి

**- పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టిన గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు**

**- అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటగిరి**



**చింతపల్లి నవంబర్ 22 (జనస్వరం) :** రాష్ట్రంలో గిరిజన చట్టాలు హక్కులు నిర్వీర్యానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని, ఆ చట్టాలు హక్కులను ప్రతిష్టంగా అమలు పరచేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కృషి చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా కార్య దర్శి ఉగ్రంగి వెంకటగిరి అన్నారు. బుధవారం అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు లోచలి చిట్టినాయుడు, పాతను రామరాజు లతో కలిసి బోయ వాల్మీకులు, బెంతి ఒరియాలను గిరిజన జాబితాలో చేర్చడం వలన గిరిజనులకు నష్టం వాటిల్లుతుందని పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీవో నెంబర్ 3 రద్దు చేయడంతో శత శాతం ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం జరిగిందని, కనీసం గిరిజన జిల్లాలకు కూడా గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా గిరిజనేతలకు అనుకూలంగా నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న గిరిజన బ్యాక్ లాగ్ పోస్టులను విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు చేసి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గిరిజనులకు వర్తించేలా రాష్ట్రపతి దృష్టి సారించాలని ఆ పోస్ట్ కార్డు ఉద్యమంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కే అచ్చిబాబు, మురళి పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు



**హైదరాబాద్, నవంబర్ 22 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ రహమత్ నగర్ డివిజన్, ఓం నగర్ రాఘవ, యనమల రాజు అధ్వర్యంలో రహమత్ నగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాగంటి గోపీనాథ్, విష్ణు వర్ధన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరు చేసిన అభివృద్ధి పనులువలనే మాగంటి గోపీనాథ్ నాయకత్వం లోని బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. వీరిలో కొంతమంది స్వాములు మాగంటి గోపీనాథ్‌కి గుడిలో నీటి సమస్యను తెలపగా త్వరగా ఆ పనిని చేస్తానని తేలిపారు. మాగంటి గోపీనాథ్ 100 మంది సభ్యులకి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను కేసీఆర్ పెదలకి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించారు. ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ పథకం కింద రూ.1,00,116 ఇచ్చి పెళ్లి చేస్తున్నారని తెలిపారు. అందరు ఓటు హక్కు వినియోగించు కోవాలని దేశానికి నిజమైన నాయకుడు ఎంతో అవసరమని, సరైన వారిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం మొత్తం గులాబీమయంతో ముందుగానే విజయ సంకేతాలు తెలుపుతున్నారని తెలిపారు. శివ, వెంకట్, రవి, నారాయణ, ప్రసాద్, వాసు, గోవింద్, నాగరాజు, శివ, వాణి, సత్యవతి, సునీత, విజయలక్ష్మి తదితరులు పార్టీలో చేరారు. డివిజన్ నాయకులు నజీర్, మూర్తి, గౌరీ శంకర్ చందర్ రాజ్, రాఘవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి



**చీరాల, నవంబర్ 22 (జనస్వరం) :** అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజల రాక పోకలకు ఇబ్బంది లేకుండా, త్వరితగతిన పూర్తి చేయాలని, అధికారులతో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. చీరాల మునిసిపల్ పరిధిలోని, మసీద్ సెంటర్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను, ఎమ్మెల్యే బలరామ్ పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ వరికూటి.అమృతపాణి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కంపా అరుణ్, గుంటూరు ప్రభా కరరావు, కలవకూరి యానాదిరావు, గొట్టిపాటి ఎబినేజర్, తోకల అనిల్, కోలా శివ, కోడూరి ప్రసాద్ రెడ్డి, మల్లి రామకృష్ణ, దామర్ల శ్రీ కృష్ణ, కట్టా గంగయ్య, మునిసిపల్ డి.ఇ. ఏసయ్య, ఏ.ఇ. కట్టా రవి, మునిసిపల్ సిబ్బంది, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పాలన

**మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు**




**చీరాల, నవంబర్ 22 (జనస్వరం) :** వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సంక్షేమ పాలన సాధ్యమని, మళ్లీ ముఖ్య మంత్రిగా జగన్ వస్తే రాష్ట్ర అభివృద్ధి, చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ వస్తేనే, చీరాల నియోజకవర్గ అభివృద్ధి తథ్యమని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, వైసీపీ చీరాల ఇంచార్జీ కరణం వెంకటేష్‌ల ఆదేశాలమేరకు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు అధ్యక్షతన, చీరాల మునిసిపల్ పరిధిలోని, క్లస్టర్-2లో హైయర్ పేట సచివాలయ పరిధిలో నిర్వహించిన, ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి ప్రజలనుండి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇంచార్జీలు దాసరి రామకృష్ణ, కోలా శివ, జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, వాసి మల్ల వాసు, గోలి స్వాతి, మల్లెల లలిత రాజశేఖర్, చుక్కా నాగ లక్ష్మీ, బత్తుల అనిల్, మించాల సాంబశివరావు, గోలి జగదీష్, షేక్ సుభాని, షేక్ మహిమూద్, యాతం మేరీబాబు, మామిడాల సుబ్బారావు, చిలుకోటి శ్రీనివాసరావు, శవనం సామ్యేల్, మున్సిపల్ అధికా రులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, మెప్మాసిబ్బంది, వాలంటీర్లు, గృహసారధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా నిలిచిపోయిన కోరుకొండ-వీరవరం రహదారి పనులు

**- గుత్తేదారుడు నిర్లక్ష్యానికి ఈ రహదారే నిదర్శనం.**

**- ఎన్నో ఏళ్ల గిరిజనుల కల అడియాసలు...?**

**- చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపణ.**



**చింతపల్లి, నవంబర్ 22 :** ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ గ్రామాల రహదారి పనులు ఎట్టకేలకు మొదలయ్యాయని, త్వరలో తమకు రహదారి కష్టాలు తీరుతాయని ఆశపడిన ఆ గిరిజనుల ఆశలను గుత్తేదారుడు నిర్లక్ష్యం కారణంగా అడిఆశలయ్యాయని బలపం పంచాయతీలోని మారుమూల గిరిజన ప్రజలు ఆరోయిస్తున్నారు. పాడేరు శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి చొరవతో, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ల సమన్వయంతో, కోరుకొండ నుంచి తూరుమామిడి, బూరుగుబయులు మీదుగా వీరవరం వరకు రహదారి పనులు మంజూరు చేశారని, కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారుడు నిర్లక్ష్యం కారణంగా తాము రహదారి సౌకర్యం కోల్పోయమని మండలంలోని మారుమూల బలపం పంచాయతీ మారుమూల గిరిజన ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంత కాలం క్రితం పాడేరు శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి చొరవతో, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ల సమన్వయంతో, కోరుకొండ నుంచి తూరుమామిడి, బూరుగుబయులు మీదుగా వీరవరం వరకు తలపెట్టిన రహదారి పనులు గుత్తేదారుడు నిర్లక్ష్యం కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయాయని వారన్నారు. ఈ పనులను చేజిక్కించుకొన్న గుత్తేదారుడు ముందుగా రోడ్డు చదును చేసేందుకు పనులు చేపట్టారని వారన్నారు. అందుకొరకు కల్వర్టు నిర్మించాల్సిన చోట కల్వర్టు పనులు చేపట్టి పనులు ప్రారంభించారని అన్నారు. రహదారి పనులను శరవేగంగా జరుపుతున్న ఆయన నెల రోజుల క్రితం నుండి అర్ధాంతరంగా పనులు నిలిపివేసి ముఖం చాటేశారని వారు ఆరోపించారు. దీనితో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అసహనం వ్యక్తం చేశారు. "వాన నీళ్లకు ఆశపడి కుండ నీళ్లు ఒంపుకున్నట్టుగా" తమ పరిస్థితి తయారయ్యిందని వారు వాపోయారు. కోరుకొండ నుండి భూరుగుబయలు మీదుగా వీరవరం వరకు తలపెట్టిన రహదారి పనులు గుత్తేదారుడు నిర్లక్ష్యం కారణంగా అర్ధాంతరంగా నిలిచి పోయాయని వారు ఆరోపించారు. రహదారి నిర్మాణం కోసం పనులు ప్రారంభించిన గుత్తేదారు ఇప్పటి వరకు ఉన్న చిన్న రహదారిని ఇష్టానుసారంగా తవ్వేస్తు మధ్యలో వదిలి వేశారన్నారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా తమ గ్రామాలకు నడకదారి సైతం మూసుకొని పోయిందని వారు ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన రహదారి పనులు పునరుద్ధరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకా వారోత్సవాలు




**చింతపల్లి నవంబర్ 22 (జనస్వరం) :** మండలంలోని బెన్నవారం చుట్టుపక్కల గిరిజనులతో కలిసి ప్రధాన మంత్రి ఆవాష్ యోజన, ఆవాస్ దివాస్, ఆవాస్ సప్తాహ్ గ్రామీణ పథకా వారోత్స వాలను జడ్పిటిసి పోతురాజు బాలయ్య ఘనంగా నిర్వహించారు. ప్రధాన మంత్రి అవగాహన వారోత్సవాల సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి అవాస్ యోజన, ప్రధాన మంత్రి గ్రామీణ పథకంలో మంజూరు అయిన గృహాల లబ్ధిదారులు వారు నిర్మించుకున్న గృహాలకు దశల వారీగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసమ్మ, వైస్ ఎంపీపీ వెంగళరావు, ఎంపిటిసి సభ్యుడు రమణ, హౌసింగ్ ఏఈ సాయి, హౌసింగ్ఇన్స్పెక్టర్ రమణ, రాజారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది : అజరుద్దీన్



**హైదరాబాద్, నవంబర్ 22 (జనస్వరం) :** బుధవారం కాంగ్రెస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మహ్మద్ అజరుద్దీన్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇంచార్జి నవీన్ యాదవ్‌తో కలిసి షేక్పేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజరుద్దీన్ నిరుపేదల వాళ్ళ ఇంటికి వెళ్లి, వారి సమస్యలు ఇంకా వారికి ఉన్న బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలతో మీ జీవితాల్లో వెలుగు వస్తుంది, కనుక మీ ఓటు హస్తం గుర్తుకే వేయాలని కోరారు.

## కూసేంత వర్షానికే జలమైన రోడ్లు





**రేణిగుంట, నవంబర్ 22 (జనస్వరం) :** పట్టణంలో బుధవారం కూసేంత వర్షానికి డ్రైనేజీ కాలువలు నిండడంతో ఎక్కడ చూసినా భారీ మురికి నీరుతో రోడ్లు జలమైయ్యాయి. దీంతో పాదచారులకు ఇబ్బంది దయక పరిస్థితి తలపించింది. అసలే డెంగ్యూ మలేరియాతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఈ మురికి నీరుతో ఎటువంటి రోగాలని చలి చూడాల్సి వస్తుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు



**పాయకరావుపేట, నవంబరు 22 (జనస్వరం) :** పట్టణంలోని వై జంక్షన్, తాండవ జంక్షన్, గౌతమ్ థియేటర్ సెంటర్ల వద్ద బుధవారం సిఐ పాలిని అప్పలరాజు తమ సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆటోల్లో పరిమితికి మించి స్కూల్ పిల్లలను తరలించకూడదని ఆటో డ్రైవర్లకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు బండి రికార్డులు, లైసెన్సు, ఇన్స్యూరెన్స్ తదితర పత్రాలను తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సిఐ అప్పలరాజు తెలిపారు.

## రేణిగుంటకి తాగు నీరు అందించిన ఘనత గోపాలన్నదే

- జోరు వానలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం
- మా ప్రభుత్వం రాగానే ప్రజల సమస్యలను కచ్చితంగా నెరవేరుస్తాం
- బొజ్జల సుధీర్ రెడ్డి



**రేణిగుంట, నవంబర్ 22 (జనస్వరం) :** రేణిగుంట పట్టణం పెట్రోల్ బంక్ వెనుక నందు శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఇంటింటి తిరిగి తెలుగుదేశం పార్టీకి మద్దత్తు ఇచ్చి గోపాలన్న పాలన తీసుకు రావాలని కోరారు. బొజ్జల సుధీర్ రెడ్డికి నాయకులు ఘన స్వాగతం పలికారు. బాబు ముఖ్యమంత్రిని.. సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో తెలిపారు. ఇంటింటికి తిరిగి ప్రజ సమస్యలు తెలుసుకుని వారి బాధలు తీరుస్తానన్ని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇంచార్జి డి పుష్పనాదం, మురళి, కన్నా రెడ్డి, మేరీ, దినేష్, రవి, ధనంజయ్, సిటీ సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## చిట్టేటి భానుచందర్‌ను ఎందుకు తొలగించారో ట్రాన్స్కో అధికారులు వివరణ ఇవ్వాలి : బొబ్బేపల్లి సురేష్ నాయుడు



**నెల్లూరు, నవంబర్ 22 (జనస్వరం) :** నగరంలోని స్థానిక ట్రాన్స్కో ఎస్సీ కార్యాలయం నందు జనసేన పార్టీ సర్వేపల్లి ఇంచార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నెల్లూరు జిల్లా అధ్యక్షులు చిన్న పెంచలయ్య మరియు బీఎస్పీ ఆధ్వర్యంలో మనుబోలు మండలంలో ట్రాన్స్కో నందు ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ షిఫ్ట్ ఆపరేటర్ గా పని చేస్తున్న చిట్టేటి బానుచందర్‌ను ఏ కారణాలతో తొలగించారో వివరణ ఇవ్వాలని, ఎవరి ప్రోద్బలంతో ఒక గిరిజనుల మీద ప్రతాపం చూపడం తగదని, బానుచందర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో సోమవారం నుండి ధర్నా కార్యక్రమం కార్యాలయం ముట్టడి నిర్వహిస్తామని తెలియజే శారు. ఈ కార్యక్రమంలో బాధితుడు భానుచందర్, కుటుంబ సభ్యులు జనసేన కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యం

- వరికి 46 కొనుగోలు కేంద్రాలు
- రూ.2183 మద్దతు ధర
- రాగులకు 25 కొనుగోలు కేంద్రాలు
- రూ.3846 మద్దతు ధర జిల్లా కలెక్టర్ సుమిత్కుమార్ వెల్లడి



**పాడేరు, జీకే వీధి, నవంబర్ 22 (జనస్వరం) :** ఖరీఫ్ కాలంలో జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి లక్ష్యంగా నిర్దేశించామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ వ్యవసాయాధికారులతో బౌతికంగాను, రంపచోడవం, చింతూరు డివిజన్ల పరిధిలోని అధికారులతో వర్చువల్ గాను సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 46 వరి కోనుగోలు కేంద్రాలు, 25 రాగుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. వరికి క్వింటాకు రూ.2183 లు, రాగులకు రూ. 3846 లు మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 30 వేల మెట్రిక్ టన్నులు వరి, 5 వేల మెట్రిక్ టన్నుల రాగులు కొనుగోలు చేయడానికి లక్ష్యం నిర్దేశించామని చెప్పారు. వ్యవసాయాధికారులు నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. లక్ష సాధనలో మండల వ్యవసాయా ధికారులు చురుకైన పాత్ర పోషించాలని చెప్పారు. ధాన్యం సేకరించిన తరువాత సకాలంలో ఎఫ్‌టిఓ జనరేట్ చేయాలని స్పష్టం చేసారు. తేమ పన్నెండు శాతం ఉన్న ఆరుదల ధాన్యాన్ని సేకరించాలన్నారు. జిల్లాలో వరి, రాగులు ఎన్ని టన్నులు ఉత్పతి జరుగుతున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27వ తేదీ నుండి రాగులు కొనుగోలు చేయాలని స్పష్టం చేసారు. వరి కోతలు అనంతరం వరి సేకరణ చేయాలన్నారు. వరి, రాగులు కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో నూరు శాతం ఇ క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు లబ్ది చేకూర్చుడానిక అధికారులు కృషి చేయాలని చెప్పారు. ధాన్యం సేకరణకు గోనులు, రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్చువల్ విధానంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, రంపచోడవరం పిఓ సూరజ్ గనోరే, ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ డి.ఎం. బి.గణేష్, డిఎస్ఓ శ్యామ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్. నంద్, పాడేరు, చింతపల్లి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, నేచర్ సంస్థ గౌరీ శంకర్, సంజీవిని దేవుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత బాలికకు న్యాయం చేయలేని వైసీపీ ప్రభుత్వం..



- ఏపీపీ దంపతులపై కఠిన చర్యలు తీసుకోవాలి...
- బార్ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేస్తాం.. డిగ్రీలు రద్దు చేసే వరకు పోరాడుతాం..
- అఖిలపక్ష సమావేశంలో సంఘటిత పోరుకు పిలుపునిచ్చిన నాయకులు...

**అనంతపురం, నవంబర్ 22 (జనస్వరం) :** మైనార్టీ వర్గానికి చెందిన బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయలేని అసమర్ధ వైసిపి ప్రభుత్వం అని అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం సిపిఐ పార్టీలతో పాటు పలు మైనార్టీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి తండ్రి లేని మైనర్ బాలికను కార్మిక నిబంధనలకు విరుద్ధంగా పవిత్రమైన న్యాయమూర్తిలో ఉన్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులు పనిలో పెట్టుకోవడమే కాక పైశాచికంగా ఆ బాలికపై దాడికి తెగబడడం దుర్మార్గపు చర్య అన్నారు. చైల్డ్ రైట్స్ 2005, లేబర్ రైట్స్ 1989 ప్రకారం తక్షణమే ఏపీపీ దంపతులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే వీరిపై బార్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. మైనర్ బాలికపై దాడికి తెగబడ్డ ఏపీపీ దంపతులను వెనకేసుకొస్తున్న ప్రభుత్వంపై సంఘటిత పోరుకు అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. మైనర్ అనాధ బాలికకు న్యాయం జరిగే వరకూ అఖిలపక్షం పోరాడుతుందని సమావేశంలో పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఐఎంఎం భాష, సిపిఎం నాయకులు రామిరెడ్డి, ప్రజాసంఘ నాయకులు జాకీర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శిలు రాపాక ధనంజయ, కిరణ్ కుమార్, అవుకు విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్తార్, జిల్లా ఫోక్ పర్సన్ జె.యం.బాషా, జనసేన నగర ప్రధాన కార్యదర్శిలు మేదర వెంకటేష్, రొల్ల భాస్కర్, చక్రపాణి, హుస్సేన్, ధరాజ్ భాష, నగర కార్యదర్శిలు కుమ్మర మురళి, అంజి, సంపత్, ఆకుల అశోక్, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్, బీసీ సెల్ నరసింహులు, టీడీపీ సిటీ మైనారిటీ ప్రెసిడెంట్ హాజీజ్, ఎంఐఎం యూత్ ఇంచార్జ్ మసూద్ వలి, ఆప్ యూత్ లీడర్ మసూద్ వలి, యాంటీ కరప్షన్ ఆఫ్ ప్రెసిడెంట్ మహమ్మద్ షఫి, హ్యూమన్ రైట్స్ మహిళా నాయకురాలు సరస్వతి, ముంతాజ్ బేగం, యాస్మిన్ భాను, జనసేన నాయకులు హిద్దు, విజయ్ దేవరయల్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో జనసేన ఇంటింటికీ ప్రచారం



**శ్రీకాళహస్తి, నవంబర్ 22 (జనస్వరం) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ – టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భవిష్యత్తు గ్యారంటీ పేరుతో ఉమ్మడి మినీ మానిఫెస్టోను శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా శ్రీకాళహస్తి మండలం, వాగవేడు హరిజనవాడ గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి ఉమ్మడి మినీ మానిఫెస్టోను ప్రజలకు వివరించడం జరిగింది. ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను, దోపిడీలను వివరించడం జరిగింది. రానున్న ఎన్నికల్లో జనసేన – టీడీపీ ఉమ్మడి ప్రభుత్వంను ఆశీర్వదించాలని కోరడం జరిగింది. గ్రామంలో లైట్లు లేవు, డ్రైనేజ్ కాలువలు శుభ్రం చెయ్యడం లేదు, స్మశానానికి దారి కూడా దారి లేని దయనీయ స్థితిలో ఉన్నామని, నిరుద్యోగ సమస్య ఉందని ప్రజలు ఆవేదన తెలిపారు. సమస్యలన్నీ ప్రభుత్వం వచ్చిన 3–6 నెలల్లో పరిష్కరిస్తామని వినుత ప్రజకి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండి రాఘవయ్య, శ్రీకాళహస్తి పట్టణ ఉపాధ్యక్షులు తోట గణేష్, నాయకులు పేట చిరంజీవి, కవిత, శారద, లక్ష్మి, రాజ్య లక్ష్మి, పేట చంద్ర శేఖర్, రాజేష్, సురేష్, గురవయ్య, జ్యోతి రామ్, హేమంత్, దినేష్, ఉదయ్, వెంకట రమణ, జనసైనికులు దానయ్య, ఉదయ్, చందు యాదవ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## "దళిత శంఖారావం"నకు తరలివెళ్లిన పాయకరావుపేట టీడీపీ దళిత నాయకులు



**పాయకరావుపేట, నవంబరు 22 (జనస్వరం) :** విశాఖపట్నం ద్వారకా నగర్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ వద్ద గల తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం "దళిత శంఖారావం" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట నుంచి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు తరలి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ ఎస్‌సి సెల్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు బూరుడిపూడి గోవింద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో దళితులపై జరుగుతోన్న దాడులను పార్టీ దళిత నాయకులు తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ పెరిగిపోతోన్న ఈ దాడులను ప్రభుత్వం తక్షణమే నిలువరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై కొనసాగుతోన్న దామనకాండను అదుపు చేయకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్ఎస్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొండ్రు మురళి, ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు, పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ , అనకాపల్లి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు యలకా మల్లిబాబు, ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి పల్లా విలియం కేరీ, పాయకరావుపేట టౌన్ ఉపాధ్యక్షులు చిరుకూరి పేర్రాజు, ఎంపిటిసి కశింకోట సత్తిబాబు, పార్లమెంటు నియోజకవర్గ మెంబర్ గంపల చిన రాజు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఏడిద సురేష్, టౌన్ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఎమ్మిలి దుర్గాప్రసాద్, మండల ఎస్‌సి సెల్ జనరల్ సెక్రెటరీ కుంచె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ప్రమాద ఘటనపై డాక్టర్ కందుల దిగ్భ్రాంతి



- సెవెన్ హిల్స్ లో పిల్లలకు పరామర్శ
- వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

**విశాఖపట్నం, నవంబర్ 22 (జనస్వరం) :** విశాఖలోని సంగం శరత్ జంక్షన్ వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైన చిన్నారులను విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పరామర్శించారు. వారు చికిత్స పొందుతున్న సెవెన్ హిల్స్ హాస్పిటల్ కి వెళ్లి పిల్లల పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అసలు ఈ ప్రమాదం జరిగి ఉండకూడదని అభం శుభం తెలియని చిన్నారులు ప్రమాదానికి గురై నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు కూడా తేల్చారని చెప్పారు. వాహనాలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వెళ్తే ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ సిగ్నల్ పాయింట్ ను దాటాలనే ఉద్దేశంతో వేగంగా వెళ్లడం కారణం వల్లే ఎదురుగా వచ్చిన లారీని ఢీకొనడం జరిగిందన్నారు. చిన్నారుల వైద్యానికి అయ్యే పూర్తిగా ప్రభుత్వం భరించాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని డాక్టర్ కందుల నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## తహశీల్దార్ కార్యాలయం ముట్టడిస్తాం

### జనసేన నాయకులు సూర్యచంద్ర

**జగ్గంపేట, నవంబర్ 22 (జనస్వరం) :** జగనన్న కాలనీలలో రహదారులు మరియు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోతే తహశీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ పాటంశెట్టి సూర్య చంద్ర అన్నారు. రహదారులు నిర్మించాలని అడుగుతుంటే పోలీసు కేసులు పెడతామని బెదిరించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి, బావాజిపేట, వెదురుపాక గ్రామాలలో జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గుమ్మళ్ళదొడ్డిలో జనసేన తెలుగుదేశం పార్టీల ఆధ్వర్యంలో "గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది" కార్యక్రమంలో సూర్యచంద్ర పాల్గొన్నారు. బాధితుల నిరసన విషయాన్ని తెలుసుకుని గుమ్మళ్ళదొడ్డి వచ్చిన గోకవరం తహశీల్దార్ శ్రీనివాస్ ముందు సూర్యచంద్ర సమస్యలను ఏకరువు పెట్టారు. ఇళ్ళ స్థలాలు ఇచ్చే ముందు లే ఔట్‌లో రహదారులు, అంగన్వాడిలు, పాఠశాలలు తదితర వాటిని ప్లాన్‌లో రూపొందిస్తారని నాలుగు సంవత్సరముల తర్వాత ఇప్పుడు పోలవరం కాలువకు రహదారి ఏర్పరిచామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాలనీ సమస్యల పరిష్కారానికి కలెక్టరుకి లేఖ ద్వారా



తెలియజేస్తానని తహశీల్దార్ చెప్పడంతో ఆందోళన విరమించారు. సాధ్యమైనంత తొందరలో సమస్యలని పరిష్కరించకపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సూర్యచంద్ర పేర్కొన్నారు.

## కోడుమూరు గ్రామంలో క్రియాశీలక కార్యకర్తల ఆత్మీయ సమావేశం



**కోడుమూరు, నవంబర్ 22 (జనస్వరం) :** కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం కోడుమూరు మండలం ముడుమగుర్తి గ్రామంలో క్రియాశీలక ముఖ్య కార్యకర్తల "ఆత్మీయ సమావేశం" ఏర్పాటు చేయడం జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన – టిడిపి పార్టీల సమన్వయ అధ్యక్షులు సురేష్ బాబు చింత ఆదేశాల మేరకు ముడమలగుర్తి గ్రామ నాయకులు గిరీష్, మాస్మన్న శేఖరు, రవి, గిరిధర్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలపేద దిశగా ముందుకు తీసుకు వెళ్లే విధంగా అందరం కలిసి కట్టుగా ఐకమత్యంతో కృషి చేయాలని కోరుతూ జనసేన టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు ఆకెపోగు రాంబాబు కోడుమూరు నియోజకవర్గ నాయకులు కృష్ణ బాబు, మహబూబ్ బాషా, షాలుభాష, మధుసూదన్, గోపి, మధు, నాగరాజు, వంశీ, నాగరాజు, కోడుమూరు నియోజకవర్గ జనసైనికులు పాల్గొన్నారు.

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211 REGD NO : APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.